# అతిథి దేవో భవ!

పోయినసారి చికాగో వెళ్ళినప్పుడు మా చిదంబరం వాళ్ళింట్లో దిగాను.

ఆనాడు వివేకానందస్వామి చికాకు లేకుండా చికాగోపన్యాసాలు చేస్తే, ఈనాడు మా చిదంబరం చికాగోలో చికాకోపన్యాసాలు చేస్తున్నాడు. నేనూ అతనికి అతిథి దేవుడ్ని కనుక, చిరాకు పుట్టినా చిరాకుని చిరునవ్వు పరదా వెనక దాచేసి, తల వూపుతూ కూర్చున్నాను.

"ఒరేయ్। నువ్వు ఇప్పుడు కూర్చున్నావే, ఆ కుర్చీలో పోయిన నెల్లో ఎవరు కూర్చున్నారో తెలుసా? నీ బొంద నీకెలా తెలుస్తుందిలే. సాక్షాత్తూ బాల మురళీ కృష్ణ కూర్చున్నాడు. మా ఇంట్లో రెండ్రోజులు వున్నాడులే నైస్ ఫెలో. పోయిన సంవత్సరం అక్కినేని నాగేశ్వర్రావ్. ఆయనకా కుర్చీఅంటే మహా ఇష్టంలే. మెత్తగా వుంటుందని. కూర్చుంటే ప్రోగ్రాముకి ఆలస్యమైనా ఇహ లేచేవాడుకాదు" ఇలా సాగుతుంది చిదంబరం చికాకోపన్యాసం.

చిదంబరం భార్య చింతామణి మాత్రం అలా బయటపడదు. "ఏమిటండీ సరిగ్గా తినలేదు. పోయినసారి సౌందర్య మా ఇంట్లో దిగినప్పుడూ అంతే। ఆవిడా సరిగ్గా తినదు. అందుకేనేమో అంత సన్నగా వుంటుందావిడ" అన్నది చల్లటి మజ్జిగతో పాటూ చల్లటి కమామిషులు కూడా చల్లగా వడ్డిస్తూ.

సెయింట్ లూయిస్‌లో సూర్యారావ్ వేరు. "ఆ ముగ్గురు నటులూ మా ఇంట్లోవున్న మూడు రోజులూ పూటుగా తాగి గోలచేయటమే. అందులోనూ ఫలానా ఆయనయితే మరీను. మా కార్పెట్ మీదే వాంతి చేసుకున్నాడు. అదంతా స్టీమ్

క్లీనింగ్ చేయించటానికి రెండు వందలయింది"

ఆస్టిన్‌లో ఆనందరావుగారి భార్య మాత్రం, స్వామీజీని మెచ్చుకునేది. "ఆయన మా ఇంట్లో నాలుగు రోజులున్నారా, అసలు ఆయన వున్నట్టే తెలియదు డైనింగ్ టేబుల్ మీద యాపిల్సూ అరటిపళ్ళూ పెట్టేవాళ్ళం. ఆయన పొద్దున్నే ఐదింటికే లేచి, మాకేదయినా డిస్టర్బెన్సేమోనని తన పనులన్నీ నిశ్శబ్దంగా చేసుకునేవారు. ధ్యాన్నం చేసుకుని, ఒక అరటిపండు తిని. ఫ్రిడ్జ్‌లోనించీ పాలు తీసుకుని త్రాగేవారు. మనం ఆధ్యాత్మికంగా ఏమైనా ప్రశ్నలడిగితే, నవ్వుతూ సులభమైన భాషలో అర్ధమయ్యేట్టు చెప్పేవారు. ఆయన జ్ఞానంలో ఒక పూర్ణకుంభం"

పిట్స్‌బర్గ్‌లో ప్రకాష్‌కి ఆ టాపిక్ తెస్తేనే కోపం. "ఏదో గొప్పవాడు కదా అని మాఇంట్లో పెట్టుకున్నాను. సభయాక ఇంటికి వచ్చేసరికీ రాత్రి పదకొండున్నరయింది. ఆయన హైద్రాబాద్‌లో భార్యకి ఫోన్ చేసుకుంటానంటానన్నాడు.అతిధులు అమెరికా వచ్చినప్పుడు మధ్యమధ్యలో ఇండియాకి ఫోన్‌చేసి కుటుంబ సభ్యులతో మాట్లాడటం అవసరం కదా అని సరే అన్నాను. ప్రైవసీ కోసం కార్డ్‌లెస్ ఫోన్ ఇచ్చి, అతిథి గదిలోకి వెళ్ళి ఫోన్ చేసుకోమని చెప్పి నేను నిద్రపోయాను. ఆయన అమెరికానించి వెళ్ళిపోయిన పదిహేను రోజులకి ఫోన్ బిల్ వచ్చింది, నూట ఎనభై డాలర్లకి. బషీర్‌బాగ్‌లో భార్యతోనూ, మెహిదీపట్నంలో మేనల్లుడి తోనూ, దోమలగూడాలో దూదేకుల సాయిబ్బుతోనూ ఆయన తూర్పున తెల్లవారే వరకూ మాట్లాడినట్టు ఫోన్ బిల్ చూపిస్తున్నది!"

లాస్ ఏంజలెస్‌నించీ లావణ్య అంటుంది "నెల రోజుల పిల్ల మా అమ్మాయి. పి. సుశీలగారు మా ఇంటికి వచ్చారా, ఆవిడకి మా అమ్మాయంటే చాల ఇష్టం. ఉన్న నాలుగురోజులూ దాన్ని ఒళ్ళో పడుకోబెట్టుకుని పాటలే పాటలు. పాపకి నిద్ర రాకపోతే వటపత్ర సాయికీ వరహాల లాలీ అని జోలపాట పాడేవారు. సాక్షాత్తూ నా అభిమాన గాయకి సుశీల. ఆ అదృష్టం మాదీ, మా అమ్మాయిదీ"

ఫ్లారిడానించి పార్ధసారథి, వారి మిత్రులూ అంటారూ, "అసలిది నమ్మలేకపోయాం. పోయినసారి ఫలానా ఊళ్ళో తెలుగు మహాసభలు పెట్టినప్పుడు వచ్చాడు ఈ తెలుగు సినిమా హీరో. ఏవో కొన్ని మంచి వేషాలూ వేస్తాడు కదా మంచివాడే అనుకున్నాం. లిఫ్ట్‌లో తొమ్మిదో అంతస్తునించీ కిందికి దిగుతున్నాట్ట. అతనితో పాటూ పద్దెనిమిదేళ్ళ సరిత కూడా వస్తున్నదిట. ఈయన ఆ అమ్మాయిని మాటల్లో పెట్టి, ఇవాళ రాత్రికి ఏంచేస్తున్నావ్? ఖాళీగావుంటే చెప్పు. డేటింగ్‌చేద్దాం అన్నాట్ట. ఆ అమ్మాయి అమెరికాలో పుట్టి పెరిగిన పిల్ల. పెద్దగా నవ్వి మా నాన్న వయసులో వున్నావ్ నువ్వు నీతో డేటింగేమిటి అన్నదిట. అంతే కాకుండా లిఫ్ట్ కిందికి రాగానే, అతని చేయి పట్టుకుని తన స్నేహితుల దగ్గరికి లాక్కుపోయి ఇతను నాతో డేటింగ్ చేస్తాట్ట. డేటింగ్ అంటే అర్ధంకూడా తెలీని పెద్దమనిషి" అని ఆట పట్టించించిట. అక్కడవున్న పిల్లా పెద్దా, ఆడా మగా, అందరూ అతన్నే వింతగా చూస్తుంటే, ఆ మహా నటుడు తల పైకెత్తలేదుట... "

వాషింగ్టన్‌నించీ వామనరావేమంటారో చూద్దాం. "ఆయన సినిమాల్లో

వ్రాసిన కొన్ని పాటలు, నేను విశ్లేషణ చేసి, నాకెందుకు నచ్చాయో చెబితే ఆయన ఆశ్చర్యపోయాడు. ముఖ్యంగా గోపాల బాలుడమ్మా పాటలో ఆయన వ్రాసిన ఒక చరణం. నవమాసాలూ మోసి ఎంతో కష్టపడి నిన్ను కనబోతున్న మీ అమ్మకి వరాలిస్తున్నానూ, అవి మీ అమ్మకివ్వమని దేవుడు ఆ పసివాడికి ఇస్తే, వాడు భద్రంగా వాటిని తన గుప్పిట్లో దాచి తెచ్చి అమ్మ ఒడిలో పడుకుని ఆ గుప్పిళ్ళు విప్పి, ఆ వరాలని తన కన్నతల్లికి ఇచ్చాట్ట. ఎంతటి చక్కని భావన. అప్పుడు అన్నాను– ఈనాటి తెలుగు సినిమా పాటల రచయితలు చాలమంది చేయి జారారు. మీరు చేయి జారని రచయిత అని. చేయి జారటమేమిటండీ అని అడిగాడాయన. కాలు జారి శీలం కోల్పోయినట్టుగా ఈనాటి మన తెలుగు సినిమా రచయితలు ఎందరో అశుద్ధ తెలుగులో బూతుపాటలు రాసి, చేయి జారి వ్యభిచారులయారని.... "

కాన్సాస్ సిటీనించీ కాంతారావ్ ఏమంటాడంటే – "పోయినసారి తెలుగు మహాసభలు పూర్తికాక ముందునించే ఈయన నా వెంబడి పడటం మొదలుపెట్టాడు. తన ప్రోగ్రాం మా వూళ్ళో ఇప్పించమని. అయ్యా మా ఊళ్ళో కష్టం ఇంకా ఏదైనా పెద్ద వూళ్ళో ప్రయత్నం చేసుకోండీ అంటే వింటాడా... ఇంకా నిష్ఠూరంగామాట్లాడతాడు.... "

"నేను ఆ రోజ గురువుగారు వస్తున్నారని వినగానే ప్రొద్దన్న ఐదింటికే బయల్దేరి రెండొందల మైళ్ళు డ్రైవ్ చేసుకుని అక్కడికి వెళ్ళాను. వాణిగారింటికి వెళ్ళగానే సన్నగావున్న ఒకాయన ఎదురొచ్చి నమస్కారమండీ నా పేరు బాపు అన్నారు. బొమ్మలు గీయటంలోనూ, సినిమాలు తీయటంలోనూ ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన ఆయన అంత సింపుల్‌గా వుంటారనుకోలేదు. బాపు పేరుని సార్ధకం చేశారాయన. నేను వ్రాసిన పుస్తకం ఆయనకి సగౌరవంగా ఇస్తే, చదివి తన అభిప్రాయం వ్రాస్తానన్నారు. ఏదో బిజీగావుండే పెద్దమనిషి ఆమాట వూరికే అన్నారులే అనుకున్నాను. ఆయన ఇండియా వెళ్ళిన వారం రోజుల్లోనే, మెచ్చుకుంటూ విశ్లేషణ చేసి వ్రాసిన ఉత్తరం చూసి నిజంగా ఆశ్చర్యపోయాను. ఆరోజు నేను పొందిన ఆనందం, ఆయనతో మేము గడిపిన ఆ రోజూ నా జన్మలో మరిచిపోలేను. ఆయన గొప్ప కళాకారుడే కాదు. గొప్ప మనిషి కూడాను"

ఇలా ఆతిధ్యమిచ్చిన ఎందరో మహానుభావులు. అందరికీ రకరకాల అనుభవాలు. అభిప్రాయాలు.

ఏది ఏమైనా అమెరికా వచ్చేమనవాళ్ళందరూ మాకు అతిధి దేవుళ్ళే మం

* * *